క్లుప్తంగా

చదువుతోనే సమాజంలో గుర్తింపు



బ్యాగులు పంపిణీ చేస్తున్న ఉత్తమ్‌చందు, రాంలింగారెడ్డి

తాండూరు రూరల్: చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని కాంగ్రెస్ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తమ్‌చందు, మాజీ ఎంపీపీ రాంలింగారెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని జినుగుర్తి ప్రాథమిక పాఠశాలలో అక్షిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నాగప్ప, ఫౌండేషన్ ఇన్‌చార్జి నర్సిములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజ్మత్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయులు నారాయణగౌడ్, రవీందర్, జయశ్రీ, స్వప్న, భాగ్యశ్రీ, భాను, నర్సిములు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులు పెట్టొద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

దౌల్తాబాద్: వరి కొనుగోలులో తేమ పేరుతో రైతులను ఇబ్బందులు పెట్టొద్దని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ అధికారి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు నేరుగా తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. దళారులకు విక్రయించి నష్టపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ లావణ్య, సీఈఓ అనంతయ్య, చైర్మన్ వెంకట్‌రెడ్డి, ప్రమోద్‌రావు, విజయ్‌కుమార్, భగవంతు, నర్సిములు, మల్లేష్, ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి తైక్వాండోలో గోల్డ్ మెడల్

తాండూరు టౌన్: విఫగెవిన్ ఇండియా ఓపెన్ ఇంటర్నేషనల్ తైక్వాండో చాంపియన్ షిప్ పేరుతో గోవాలో నిర్వహించిన తైక్వాండో జాతీయ స్థాయి పోటీలో తాండూరుకు చెందిన విద్యార్థిని కె వైష్ణవి గోల్డ్ మెడల్ కైవసం చేసుకుంది. వ్యక్తిగత సబ్ జూనియర్ విభాగంలో ఆమె ఈ ఘనత సాధించింది. స్థానిక శ్రీచైతన్య స్కూల్లో నాల్గోతరగతి చదువుతున్న వైష్ణవి జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించినందుకు తల్లిదండ్రులు పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ మదార్, మాస్టర్లు మనోహర్, కుషాల్, పీఈటీ విజయ్ భాస్కర్, వెంకటేష్, ఉపాధ్యాయులు అభినందించారు. చిన్ననాటి నుంచి బాలికలు తైక్వాండో వంటి ఆత్మరక్షణ విద్యను నేర్చుకోవాలని ప్రిన్సిపాల్ మదార్ తెలిపారు.

ప్రతిఒక్కరూ మొక్క నాటాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల




మొక్క నాటి నీరుపోస్తున్న మంజుల

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఏడో వార్డు మహవీర్ ఆస్పత్రి రోడ్డులోని మున్సిపల్ పార్కులో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అధికారులతో కలిసి మొక్కలు నాటారు. మంగళవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ఏక్ పేడ్-మాకే నామ్ పే అనే నినాదంతో నెహ్రూయువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం అనంతగిరిలో నిర్వహించిన శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో ఆమె మాట్లాడారు. ప్రకృతిని కాపాడటంతో పాటు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎన్‌వైకే అధికారి ఐజయ్య, కౌన్సిలర్లు చందర్‌నాయక్, మోముల స్వాతి రాజ్‌కుమార్, ఆసీఫ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డైట్, కాస్మెటిక్ చార్జీల పెంపు హర్షణీయం

తాండూరు టౌన్: రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల డైట్, కాస్మెటిక్ చార్జీలను కాంగ్రెస్ ప్రభుత్వం పెంచడంతో మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాఘవేందర్ మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

పల్లెల్లో పంచాయతీ కోలాహలం



మోమిన్‌పేట గ్రామం

- జీసీ కమిషన్ ఏర్పాటుతో ఆశావహుల్లో ఆనందం
- రెండు నెలల్లో ఎన్నికలు నిర్వహించనున్నారని నేతల జోస్యం

మోమిన్‌పేట: పల్లెల్లో పంచాయతీ ఎన్నికల కోలాహలం ప్రారంభమైంది. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వచ్చే సంక్రాంతిలోపు నూతన సర్పంచులు కొలువుతీరుతారని ప్రకటించడంతో గ్రామాల్లో ఆశావహుల్లో కోలాహలం మొదలైంది. ఎక్కడ నలుగురు చేరిన పంచాయతీ ఎన్నికలపైనే చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇవ్వడం వల్ల రిజర్వేషన్ ఎలా ఉంటాయని చర్చించుకుంటున్నారు. బీసీ గణన కోసం నేటి నుంచి రాష్ట్రంలో కుల గణన సర్వే ప్రారంభం కానుంది. అందుకు అనుగుణంగా రిజర్వేషన్లను ఏర్పాటు చేసేందుకు బీసీల ఆర్థిక, సామాజిక స్థితిగతులను అంచనా వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం బీసీ కమిషన్‌ను నియమించింది. దీంతో నెల రోజుల్లో ఆ కమిషన్ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ప్రభుత్వం చేస్తున్న హడవిడితో ఎన్నికలు నిర్వహిస్తారనే నమ్మకం ఆశవహుల్లో పెరుగుతుంది. దీంతో వారు రిజర్వేషన్లపై లెక్కలు వేసుకుంటున్నారు. నూతన ప్రభుత్వం మార్కు కోసమే ఎనిమిది నెలలుగా ఎన్నికలకు దూరంగా ఉందని గ్రామాల్లో చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా రెండు నెలల్లో ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించనుందని నేతలు భావిస్తున్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇవ్వడంతో అమలు చేసేందుకు సమయం పట్టిందని పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు పేర్కొంటున్నారు. సర్పంచుల పదవీ కాలం ముగిసిన సంగతి తెలిసిందే. దీంతో ప్రత్యేక పాలనలో నిధులు లేక కొన్ని చిన్న పంచాయతీలలో చెత్త సేకరణ కూడా ఇబ్బందిగా మారిందని ఆయా గ్రామ కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలంటే తప్పని సరిగా పాలక వర్గం ఉండాలనే నిబంధనలు ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ క్రమంలో పంచాయతీలకు ఎన్నికల నిర్వహణ తప్పనిసరైంది. నూతన ఓటరు జాబితా తయారు కావడం, అధికారులు ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా సిద్ధంగానే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. పల్లెల్లో సర్పంచ్ పదవికి పోటీ పడే ఆశావహులు లెక్కలు వేస్తూ తమకే అనుకూలంగా రిజర్వేషన్లు రావచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పల్లెల్లో ఎన్నికల వేడి మొదలైందని తెలుస్తుంది. ఎక్కడ ఏఇద్దరు కలిసినా స్థానిక పంచాయతీ ఎన్నికలపైనే చర్చ చేస్తున్నారు. ఏ రిజర్వేషన్ వచ్చిన తమ అభ్యర్థులను రంగంలో దించేందుకు ఇప్పటి నుంచే ప్రధాన పార్టీల నాయకులు సన్నద్ధమవుతున్నారు. మండలంలో 28గ్రామ పంచాయతీలతో పాటు నూతనంగా రావులపల్లి ఏర్పడింది. దీంతో మొత్తం పంచాయతీలు 29కి పెరిగాయి. రోజురోజుకి ఆశావహుల జాబిత కూడా పెరుగుతుందని నేతలు చెబుతున్నారు. దీంతో నెల రోజుల్లో రిజర్వేషన్లపై స్పష్టత రానుందని అధికారులు చెబుతున్నారు.

ప్రత్యేక తరగతులు నిర్వహించాలి



అభ్యసన సామర్థ్యాలు పరిశీలిస్తున్న రాంరెడ్డి

ఎంఈఓ రాంరెడ్డి

దుద్యాల్: చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఎంఈఓ రాంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని హస్నాబాద్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉర్దు మీడియం, ప్రాథమిక పాఠశాల, ప్రాథమికోన్నత బాలికల పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాల, ప్రాథమికోన్నత బాలికల పాఠశాలలో విద్యార్థుల పఠన, లేఖన సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పాఠ్యాంశం బోధించిన తర్వాత బోధనను అర్థం చేసుకున్నారా? లేదా? అనేవి నిర్ధారణ కోసం తరగతి గదిలో వారిని ప్రశ్నించాలన్నారు. ముఖ్యంగా గణితం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు నర్సిములు, జ్యోతి, రత్నకళ, పీడీ అనిల్, సీఆర్‌పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచులు

దౌల్తాబాద్: పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని మాజీసర్పంచులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మాజీ సర్పంచులు పెండింగ్ బిల్లుల కోసం నిరసన చేపట్టారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తాము అప్పులు చేసి ఎంతో కష్టపడి గ్రామాల్లో చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు బిల్లులు నేటికి విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి సుమారు 11 నెలలు దాటి నా నేటికీ పెండింగ్ బిల్లులు విడుదల చేయకపో వడం బాధాకరమన్నారు. వెంటనే పెండింగ్ బిల్లు లు విడదలు చేసి తమకు న్యాయం చేయాలని కోరా రు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ కోట్లమహిపాల్, మహిపాల్‌రెడ్డి, భీములు, పాల్గొన్నారు.

మున్నూరుకాపు గ్రామ కమిటీ ఎన్నిక



మున్నూరు కాపు సంఘం సభ్యులు

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని ఉడిమేశ్వరం గ్రామంలో మున్నూరుకాపు గ్రామ కమిటీని మంగళవారం బాకారం చంద్రశేఖర్, అరిగె అనంత ప్రసాద్, బాకారం మల్లయ్య సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా గంగాపోళ్ల నరసింహారెడ్డి, గౌరవ సలహాదారుడిగా గంగాపోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, అధ్యక్షుడిగా పడమటి మాసప్ప, ఉపాధ్యక్షుడిగా మున్నూర్ బాలరాజు, సహఉపాధ్యక్షుడిగా గంగాపోళ్ల రాములు, ప్రధాన కార్యదర్శి మున్నూరు శంకరప్ప, సహాయ కార్యదర్శి గంగాపోళ్ల సురేష్, ప్రచార కార్యదర్శి కానగడ్డ శ్రీనివాస్, కోశాధికారిగా బూరుగుపల్లి జనార్దన్, కార్యవర్గ సభ్యుడిగా రఘువర్ధన్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాలూకా కమిటీ నాయకులు సిరుసన్ శ్యామ్, మున్నూర్ బిచ్చప్ప, యువక మండలి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొంకూర్ నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంత పునఃప్రారంభం



సంతను ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్ మహేందర్‌రెడ్డి

మర్పల్లి: వ్యవసాయ మార్కెట్ షెడ్ ఆవరణలో మంగళవారం మార్కెట్ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, పాలక వర్గం సభ్యులు, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ పశువుల సంతను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ మహేందరెడ్డి మాట్లాడారు. మర్పల్లి వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన పశువుల సంతను మర్పల్లి, మోమిన్‌పేట్, బంట్వారం, సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం, మునిపల్లి మండలం, కర్ణాటక రాష్ట్రం కుంచారం, మొగూంధపూర్, శివరాంపూర్ వంటి ప్రాంతాల రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మర్పల్లి మార్కెట్‌లోని పశువుల సంతలో అన్ని వసతులు కల్పిస్తామన్నారు. అనంతరం మార్కెట్లో క్రయ విక్రయాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాములు యాదవ్, మండల అధ్యక్షుడు సురేశ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు సర్వేశ్, నర్సింలు యాదవ్, డైరెక్టర్లు, రైతులు, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

కుల గణనకు సర్వం సిద్ధం



పూడూరు: శిక్షణ శిబిరంలో ఎన్యూమరేటర్‌లు, సూపర్‌వైజర్‌లు

- ఒక్కో ఎన్యూమరేటర్‌కు 140 ఇళ్లు అప్పగించిన అధికారులు
- నేటి నుంచి సర్వే ప్రారంభం

దుద్యాల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుల గణన సర్వేకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలో దాదాపుగా 9వేల వరకు ఇళ్లను అధికారికంగా గుర్తించారు. బొంరాస్‌పేట మండలం నుంచి దుద్యాల్ మండలంలో చేరిన గ్రామాలతో పాటు దౌల్తాబాద్, కోస్గి, కొడంగల్ మండలాల నుంచి చేరిన గ్రామాలైన కుదురుమల్ల, సంగాయిపల్లి, సంగాయిపల్లి తండా, హకీంపేట్, పోలేపల్లి, పల్లెగడ్డ, హస్నాబాద్, ఆలేడ్ గ్రామాలు కలుపుకుని 9వేల వరకు ఉండగా కుటుంబాల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. సర్వే నమోదు చేయడానికి ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను ఎన్యూమరేటర్లుగా నియమించారు. ఒక్కో ఎన్యూమరేటర్‌కు 140 ఇళ్లను అప్పగించనున్నారు. ఆ 140 ఇళ్లలోని ప్రతి కుటుంబాల వివరాలను నమోదు చేయాలని అధికారులు సూచించారు. ఈ కుల గణనలో 56 ప్రధాన ప్రశ్నలు ఉన్నట్లు పేర్కొ న్నారు. సర్వేకు సంబంధించిన అన్ని పత్రాలను దుద్యాల్ గ్రామ పంచాయతీ కార్యాయలంలో సూపర్‌వైజర్ విజయరామారావ్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ మంగళవారం అందజేశారు.

తాండూరు రూరల్‌లో..

తాండూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో మండలం నుంచి 86 మంది ఉపాధ్యాయులు పాల్గొంటారని ఎంఈఓ వెంకటయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో 45 ప్రాథమిక పాఠశాలలు మధ్యాహ్నం వరకే కొనసాగనున్నాయి. మధ్యాహ్న భోజన అనంతరం అధికారులు సర్వేలో పాల్గొంటారని ఎంఈఓ తెలిపారు.

సర్వే సిబ్బందికి శిక్షణ

కొడంగల్: మున్సిపల్ పరిధిలో బుధవారం నుంచి ఇంటింటి కుటుంబ సర్వే చేసే సిబ్బందికి మంగళవారం శిక్షణ ఇచ్చారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, ఎమ్‌ఈఓ రాంరెడ్డి సలహాలు సూచనలు ఇచ్చారు. సర్వే చేయాల్సిన విధానాన్ని వివరించారు.

పూడూరులో..

పూడూరు: గ్రామాల్లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే బుధవారం నుంచి ప్రారంభమవుతుందని ఎంపీడీఓ పాండు తెలిపారు. 31 గ్రామ పంచాయతీలకు 84 ఎన్యూమరేటర్‌లను, 10 మంది సూపర్ వైజర్‌లను నియమించామని తెలిపారు. ముందస్తుగా 6, 7, 8 తేదీల్లో ఎంపిక చేసిన బ్లాకుల్లో స్టిక్కరింగ్ చేసి ఇంటి యజమాని పేరు రాసుకుంటారని తెలిపారు. మరుసటి రోజు నుంచి కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసుకుంటారన్నారు.



కొడంగల్: మాట్లాడుతున్న కమిషనర్ బలరాం నాయక్



దుద్యాల్: సర్వేకు సంబంధించిన పత్రాలతో ఎన్యూమరేటర్లు, అధికారులు

సంక్షిప్త వార్తలు

• విద్యార్థులకు టాలెంట్ టెస్టు

కొడంగల్: పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో తొమ్మిది, పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు అమ్మనాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం టాలెంట్ టెస్టు నిర్వహించారు. విద్యార్థులకు భవిష్యత్‌లో ఉపయోగపడే విధంగా పాఠ్య పుస్తకాలు, జనరల్ నాలెడ్జుకు సంబంధించి 100 మార్కులకు ప్రశ్నాపత్రం తయారు చేసినట్లు ఫౌండేషన్ ప్రతినిధి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, శ్రీబాలాజీ కేజీ ఉన్నత పాఠశాల, కృష్ణవేణి, నవీన ఆదర్శ, శ్రీ గాయత్రి, శ్రీవిద్య పాఠశాలల విద్యార్థులు పరీక్ష రాశారని పేర్కొన్నారు.

• సంఘం ఏర్పాటునకు సహకరించాలి

ధారూరు: నాగారంలో నూతన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఏర్పాటునకు తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు సమష్టిగా సహకారం అందించాలని ధారూరు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. పాత పీఏసీఎస్‌లను పునరుద్ధరించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం శుభ పరిణామని పేర్కొన్నారు.

• వ్యసనాలకు దూరంగా ఉండండి

కొడంగల్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలంగాణా సాంస్కృతిక సారథి వికారాబాద్ జిల్లా కళాకారులు పేర్కొన్నారు. మంగళవారం అన్నారం గ్రామంలో ఆట పాటలతో చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రచారం చేశారు. గంజాయి, డ్రగ్స్, మత్తు మందు వాడడం వల్ల జీవితాలు పాడైపోతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు వెంకట్రాములు, అన్నాబాయి, అర్చన, శ్రీను, సంజీవ, భిక్షపతి, సంధ్య, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

• ఉపాధ్యాయులను కేటాయించడం బాధాకరం

కుల్కచర్ల: రాష్ట్ర ప్రభుత్వం కుల గణనకు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను మాత్రమే కేటాయించడం బాధాకరమని కుల్కచర్ల మండల పీఆర్టీయూ అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బస్వరాజు పేర్కొన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం సర్వేకు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను మాత్రమే తీసుకోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

• దాడి చేసిన వారిని శిక్షించాలి

తాండూరు టౌన్: హిందూ దేవాలయాలపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని తాండూరు భజరంగ్ దళ్ సభ్యులు మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు కాలనీ హనుమాన్ మందిరంలోని నవగ్రహ విగ్రహాలను గుర్తు తెలియని దుండగులు ఇటీవల ధ్వంసం చేశారన్నారు. 20 రోజులుగా రాష్ట్రంలో ఏదో ఒక చోట హిందూ దేవాలయాలపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

• సీఎం సహాయనిధితో పేదలకు మేలు

మర్పల్లి: సీఎం సహాయనిధి పేదలకు వరమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మల సురేశ్ పేర్కొన్నారు. మంగళవారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ బ్లాక్ -2 అధ్యక్షుడు కృష్ణారెడ్డితో కలిసి తుమ్మల సురేశ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆర్థిక స్థోమత లేని పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి భరోసానిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాములు యాదవ్, జాలిఉపాధ్యక్షుడు రవీందర్, కార్యదర్శి సంజీవరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, సహకార సంఘం ఉపాధ్యక్షుడు ఫసి, మండల వర్కింగ్ ప్రసిడెంట్లు రాచన్న, మధుకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, పార్టీ శ్రేణులు సర్వేశ్, నర్సింలు యాదవ్, ఈశ్వర్, పాండునాయక్, ప్రభాకర్‌రెడ్డి, మోమిన్‌పేట్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకరయ్య మార్కెట్ డైరెక్టర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

• నాగ్‌సాన్‌పల్లిలో పశు వైద్య శిబిరం

ధారూరు: నాగ్‌సాన్‌పల్లిలో మంగళవారం పశువులకు గర్భకోశ, పశువైద్య శిబిరం నిర్వహించారు. ధారూరు పశువైద్యాధికారి ఎస్ శ్వేత 42 ఆవులు, గేదెలకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 62 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. 28 దూడలకు, 132 మేకలకు నట్టలమందు వేశారు. అనంతరం కృత్రిమ గర్భధారణ చికిత్స కరపత్రాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది బాబురావు, శ్యామ్‌రావు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

మిల్లర్ల సమస్య ఉంది

వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే బీఎంఆర్



తాండూరు: వికారాబాద్ జిల్లాలో రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌ను ఆయన వీక్షించారు. తాండూరుతో పాటు వికారాబాద్ జిల్లాలోని రైస్ మిల్లర్లు సీఎంఆర్ చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. జిల్లాలో నెల కొన్న సమస్యను పరిష్కరించాలని కోరారు.

అధైర్య పడొద్దు అండగా ఉంటా

మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

బంట్వారం: బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దని, పార్టీ ఎళ్లవేళలా అండగా ఉంటుందని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ధైర్యం చెప్పారు. కోట్‌పల్లి మండలంలోని బార్వాద్, కొత్తపల్లి గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తుల కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుందరి అనిల్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి బదిలీ సర్వసాధారణం




ఉపాధ్యాయులను సన్మానించిన అధికారులు, గ్రామస్తులు

కుల్కచర్ల: ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సర్వసాధారణమని కుల్కచర్ల మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్ పేర్కొన్నారు. మంగళవారం కుల్కచర్ల మండలం బొంరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు సూర్య, అరుణ బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంఈఓ హబీబ్ అహ్మద్ మాట్లాడారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషిచేసే ఉపాధ్యాయులు ఎక్కడికెళ్లినా గుర్తింపు, గౌరవం లభిస్తాయని పేర్కొన్నారు. నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులు బస్వరాజు, లక్ష్మణ్‌లకు స్వాగతం పలుకుతూ వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేష్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ చంద్రమ్మ, సీఆర్పీ కృష్ణ, అంగన్‌వాడీ టీచర్ కవిత, ఆయ మాణెమ్మ, శివలీల, కృష్ణ, కృష్ణయ్య, రాములు, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకం మత్స్యకారులకు వరం

ఎనుముల తిరుపతిరెడ్డి

బొంరాస్‌పేట: చేపల పెంపకం మత్స్యకారులకు వరమని కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఏర్పుమళ్ల కాకరవాణి ప్రాజెక్టులో మత్స్యశాఖ సరఫరా చేసిన రూ.1 .13లక్షల చేపపిల్లల్ని ఏడీ వెంకన్నతో కలిసి ప్రాజెక్టులోకి వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మత్స్యకారులకు సీఎం రేవంత్‌రెడ్డి మద్దతుగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింలుగౌడ్, జయకృష్ణ, అంజిల్‌రెడ్డి, వెంకట్రాములుగౌడ్, రాంచంద్రారెడ్డి, నర్సింలు నాయుడు, మల్లేశ్, కిష్టప్ప, గోవర్ధన్‌రెడ్డి, గ్రామ మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు ఆకుల రాములు తదితరులు పాల్గొన్నారు.



చేపపిల్లల్ని వదులుతున్న తిరుపతిరెడ్డి తదితరులు